క్లుప్తంగా

'ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి'

దుగ్గొండి: గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై వైద్యాధికారులు దాడులు ఆపాలని యూత్ ఫర్ స్వచ్ఛ్ దుగ్గొండి వ్యవస్థాపకులు, ఎన్నారై శానబోయిన రాజుకుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా తక్షణ ప్రథమచికిత్స అందించేందుకు ఆర్‌ఎంపీ, పీఎంపీలకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు.

కూరగాయలతో ఆరోగ్యం

చెన్నారావుపేట : ప్రజలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రాధ అన్నారు. మండలంలోని లింగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసంలో భాగంగా పోషకాహార వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



పర్వతగిరి: మండలంలోని వడ్లకొండలో రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కరిమిళ్ల శాంతమ్మ–స్వామిరావుల కుమారుడు వెంకటేశ్వర్‌రావు–నీలిమ దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

మానవ హక్కుల కమిటీ మండల కన్వీనర్‌గా అఖిల్



సంగెం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల అఖిల్‌యాదవ్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ మండల కన్వీనర్‌గా నియమిస్తూ ఆ కమిటీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ ఉత్తర్వులు అందజేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో అఖిల్ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ పేద ప్రజల తరపున చట్టపరమైన ప్రక్రియతో మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ సెక్రటరీగా సోమన్న



వర్ధన్నపేట: మండలంలోని కట్య్రాల ప్రభుత్వ పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న గుగులోతు సోమన్నను మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం వర్ధన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం రమణారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండలంలోని పీడీలు, పీఈటీలు పాల్గొనగా సోమన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఆహ్వానం



నర్సంపేట: హక్కుల నేత బొజ్జ తారకం ఎనిమిదో వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా బొజ్జ తారకం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య బుధవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈనెల 16న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే బొజ్జ తారకం వర్ధంతి కార్యక్రమానికి రావాలని తీన్మార్ మల్లన్నకు ఆహ్వానపత్రం అందజేశారు.

కుక్కల స్వైర విహారం

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని పలు వార్డుల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపాలంటే జంకుతున్నారు. రోడ్డుపైకి రావాలంటే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు వార్డుల్లో తిరుగుతున్న కుక్కలను పట్టించాలని పలువురు కోరుతున్నారు.

నర్సంపేట : పూజలు నిర్వహిస్తున్న కమిటీ బాధ్యులు



నర్సంపేట : నెహ్రూనగర్‌లో..



చెన్నారావుపేటలో..



మండపాల వద్ద పూజలు, అన్నదానాలు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం, సంగెం, మండలాల్లో గణేశ్ మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో మహాన్నదాన చేపట్టారు. సంగెంలో ఎస్సై ఎల్.నరేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమాల్లో కమిటీ ప్రతినిధులు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట: శివనగర్‌లో పూజలు చేస్తున్న టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్



నర్సంపేట : పదో వార్డులో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ పద్మప్రసాద్



ఖానాపురం : అశోక్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న కమిటీ బాధ్యులు



సంగెం : అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్సై నరేశ్

ఉపాధ్యాయుల ఔదార్యం



నెక్కొండ: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు



దుగ్గొండి: విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న ఉపాధ్యాయులు దేవేందర్, శ్రీనివాస్

నెక్కొండ : స్థానిక హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల కుటుంబ పెద్దలు అకాల మృత్యువాత పడడంతో బాధిత కుటుంబాలకు బుధవారం ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గుండ్రపల్లిలో 9వ తరగతి చదువుతున్న షేక్ షమీం తండ్రి అజ్మత్ భారీ వర్షాల కారణంగా వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. అలాగే 6వ తరగతి చదువుతున్న లావుడ్యా అవంతిక తండ్రి రూప్ల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాలను హెచ్‌ఎం రంగారావు పరామర్శించిన అనంతరం ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.1250 నగదును అందించారు. పరామర్శించిన వారిలో ఉపాధ్యాయులు ఉన్నారు.

నిరుపేద బాలికలకు సైకిళ్ల బహూకరణ

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అలేఖ్య, కీర్తనలు నిరుపేద కుటుంబానికి చెందగా వీరు ప్రతిరోజు పాఠశాలకు రావాలంటే 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వస్తున్నారు. దీంతో చలించిన పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు రావుల దేవేందర్, కవాటి శ్రీనివాస్ తమ సొంతడబ్బులతో రెండు సైకిళ్లు విద్యార్థినులకు బుధవారం బహూకరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్సంపేట రూరల్ : మండలంలోని రాజుపేట శివారులో బంజార భవన్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్ పాలాభిషేకం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నారావుపేట మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, శోభన్, ఈర్య నాయక్, బంజార సోదరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే 'సఖి'

గీసుకొండ: మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం సఖి సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నామని సఖి సెంటర్ అడ్వకేట్ శోభారాణి అన్నారు. బుధవారం మండలంలోని కొమ్మాలలో గ్రామైఖ్య సంఘాల సభ్యులకు సఖి సెంటర్ సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సఖి సెంటర్లు మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించడం, న్యాయ, వైద్య సహాయం అందించడం, తాత్కాలిక వసతి తదితర సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్ తిరుమల, క్లస్టర్ కోఆర్డినేటర్ శోభ, వీఓఏ సుధాకర్ పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి



రాయపర్తి : నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య

రాయపర్తి: గణేశ్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మంచినీళ్ల చెరువు, మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాంతాలను ఏసీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది, ఉన్నారు.

సంగెం : వినాయక నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవీందర్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్సై సురేశ్‌లతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో వినాయక నిమజ్జనంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సంగెం, ఎల్గూర్‌రంగంపేట చెరువు వద్ద నిమజ్జనం చేసే ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీజేలు పెడితే సీజ్ చేస్తాం



డీజే ఓనర్లతో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

సంగెం : వినాయక విగ్రహాల ఊరేగింపునకు డీజేలు పెడితే సీజ్ చేస్తామని పర్వతగిరి సీఐ బి.రాజగోపాల్ హెచ్చరించారు. బుధవారం సంగెం పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని డీజే ఓనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పక్కన పెట్టి వినాయక విగ్రహాల వద్ద, నిమజ్జన సమయంలో ఊరేగింపు సమయంలో డీజేలు పెట్టి భక్తి పాటలు కాకుండా సినిమా, ప్రైవేట్ సాంగ్స్ పెట్టి డ్యాన్స్‌ల పేరుతో వికృతచేష్టలు చేస్తున్నారన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారి డీజే సీజ్ చేయడంతో పాటుగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంగెం ఎస్సై ఎల్.నరేశ్, మండలంలోని గ్రామాల డీజే ఓనర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన ఉప్పుల సుగుణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుమారుడు వీరస్వామితో 1995–96 పదో తరగతి కలిసి చదువుకున్న మిత్రులు సుగుణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో బొంత రవీందర్, కుమారస్వామి, సంతోష్‌కుమార్, సంతోష్‌కుమార్, నర్సింహరాములు, కుమారస్వామి, రమేష్ ఉన్నారు.

ఖానాపురం : మండలంలోని పెద్దమ్మగడ్డకు చెందిన జ్యోతుల కొండల్‌రావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని ఏపీజే అబ్దుల్ కలాం దివ్యాంగుల సంఘం నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.6వేల ఆర్థిక సాయం అందజేశారు. రాములు, ప్రభాకర్‌రావు, కుమార్, తదితరులు ఉన్నారు.

రాయపర్తి: మండలంలోని బుర్హాన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాట్ల చంద్రయ్య గత కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. ఈ సందర్భంగా రాయపర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మృతుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట బ్లాక్ అధ్యక్షులు హామ్యా నాయక్, స్థానిక నాయకులు ఉన్నారు.

బాబును పరామర్శించిన ఎమ్మెల్యే

దుగ్గొండి: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాబు వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాబును నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, నర్సంపేట మండల అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కిరణ్‌రెడ్డి, నర్సింగరావు, రాజు, అమ్మ రోహిత్, అనిల్, కమలాకర్, సురేందర్ ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థులకు బహుమతులు



నర్సంపేట రూరల్ : విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి



పర్వతగిరి: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్ : పాఠశాల దశ నుంచే విద్యార్థులు శారీరక, మానసిక దృఢత్వం పొందాలని, ఆరోగ్యమైన శరీరం కలవారే ఉత్తమమైన ఆలోచనలతో వికాసం చెందుతారని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాడ్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని బాలాజీ విద్యార్థులు విజయవంతం సాధించి పలు పతకాలను సాధించారు. ఐదోతరగతికి చెందిన గౌతమ్ స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో స్విల్వర్, పదో తరగతికి చెందిన సిద్ధు షార్ట్‌పుట్‌లో బ్రాంజ్ మెడల్, 8వ తరగతికి చెందిన బి.హర్షవర్ధన్ 60 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

దుగ్గొండి : ఈనెల 10న వరంగల్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండల కేంద్రంలోని ఆదర్శవాణి విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం మణికంఠ రవి తెలిపారు. పాఠశాలకు చెందిన 60 మీటర్ల పరుగు పందెంలో సాయితేజ, బ్రాడ్ జంప్‌లో శివ గోల్డ్ మెడల్ సాధించగా పలువురు విద్యార్థులు సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ సాధించారు. విద్యార్థులను విద్యాసంస్థ చైర్మన్ రవి, డైరెక్టర్ భిక్షపతి, పీఈటీలు అభినందించారు.

పర్వతగిరి: హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో మంగళవారం జరిగిన వరంగల్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని ఆర్‌డీఎఫ్ రోళ్లకల్ హైస్కూల్ క్రీడాకారులు పాల్గొన్నారు. 12 ఏళ్ల విభాగంలో ఎస్‌కె.హేమాన్ లాంగ్‌జంప్‌లో ఫస్ట్ ప్రైజ్ గోల్డ్ మెడల్, 400 మీటర్ల రన్నింగ్‌లో సెకంట్ ప్రైజ్ సిల్వర్ మెడల్, 10 ఏళ్ల విభాగంలో ఇ.భార్గవి 60 మీటర్‌ల రన్నింగ్ కాంపిటీషన్‌లో నాల్గో స్థానం సాధించింది. లాంగ్‌జంప్‌లో బి.రుగ్వేద ఐదో స్థానంలో, బాలుర 12 ఏళ్ల విభాగంలో 60 మీటర్ల రన్నింగ్ కాంపిటీషన్‌లో ఎం.యశ్వంత్ నాల్గో స్థానంలో, 16 ఏళ్ల జావలింగ్ త్రో కాంపిటీషన్‌లో బి.తులసీరామ్ ఐదో స్థానం సాధించారు.

ఫలించిన 'జాజుల' పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నర్సంపేట : బీసీ కుల గణన చేపట్టాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ చేసిన పోరాటం ఫలించిందని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. పట్టణంలోని జ్యోతిబాపూలే ప్రాంగణం వద్ద బుధవారం హైకోర్టు తీర్పు సందర్భంగా మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కుల గణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం కోసం తెలంగాణ రాష్ట్రంలో బీసీల గణన చేయాలని ప్రభుత్వం నిర్ణయించి హైకోర్టుకు ప్రభుత్వం వివరణ ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన మూడు నెలల గడువులో బీసీ గణన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కురిమిళ్ల రమేష్‌చారి, చెన్నూరి రవి, వీరస్వామి, భాస్కర్, పట్టణ ఉపాధ్యక్షులు శ్యామ్‌కుమార్‌యాదవ్, శ్రీనివాస్, సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, పృథ్వీరాజ్, క్రాంతికుమార్, సుధాకర్, కీర్తి శివప్రసాద్, పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి

ఖానాపురం: బాలికలకు చిన్న తనం నుంచే సరైన పోషకాహారం అందిస్తూ రక్తహీనత లేకుండా చూసుకోవాలని ఏపీఎం కందిక సుధాకర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సోషల్ వర్కర్ పద్మ అన్నారు. స్థానిక మండల సమాఖ్యలో బుధవారం బాలికల అసమానతలు, వారి హక్కులు, బాలిక సంఘాల ఏర్పాటుపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల పట్ల జరుగుతున్న అసమానతలు, బాల్య వివాహాలు, ఇతర సమస్యలు, బాలికల హక్కులపై అవగాహన కోసం బాలిక సంఘాల ఏర్పాటు చేయాలన్నారు. సంఘాల ద్వారా కౌమార దశపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాధవి, వాసంతి, సీసీలు, సమాఖ్య అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి జ్యోతి, కోశాధికారి కృష్ణకుమారి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత




నర్సంపేట: పట్టణంలోని సర్వాపురం గ్రామానికి చెందిన జెట్టి మొగిలి ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మెపా వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం రాత్రి మొగిలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్‌లు దానం చేసే స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి

దుగ్గొండి : సమాజంలో అవినీతి, అక్రమాలను నిర్మూలించడమే జాతీయ మానవ హక్కుల కమిటీ లక్ష్యమని ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోరపూడి భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని రేబల్లె గ్రామంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు పథకాలు అందడంలో గానీ, వస్తువుల, అమ్మకం కొనుగోలు సందర్భంగా జరిగే అక్రమాలను వెలికితీయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మేర్గు రాంబాబు, ఉపాధ్యక్షులుగా తుమ్మలపెల్లి మహేందర్, వావిళ్ల కుమార్, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల రాజు, సహాయ కార్యదర్శిగా బొడిగె మోహన్, సురేష్, అధికార ప్రతినిధులుగా రాంచందర్, రాజు, ప్రచార కార్యదర్శులుగా నర్సింగం, సాంబయ్య ఎన్నికయ్యారు.

మహేశ్‌కుమార్‌గౌడ్ ఎంపికపై హర్షం



నర్సంపేట: టీపీసీసీ చీఫ్‌గా బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఎంపిక చేయడం హర్షణీయమని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం బుధవారం పట్టణ కమిటీ అధ్యక్షుడు గండి గిరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆయన సేవలను ఏఐసీసీ గుర్తించి పార్టీలో అత్యున్నతమైన పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌ను నియమించారన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్యగౌడ్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌గౌడ్, విజయ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రక్తదాన శిబిరం

గీసుకొండ: గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ పరిధి హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వ్యాపారులు బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కార్మికులు, వ్యాపారులు మొత్తం 76 మంది రక్తదానం చేయగా ఎంజీఎం బ్లడ్ బ్యాంకు వారు రక్తం యూనిట్లను సేకరించారు. హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు తోట జగన్నాథం, ఉపాధ్యక్షులు శివకుమార్, సురేశ్, బ్లడ్ బ్యాంకు వైద్యాధికారి ఆశ, కోఆర్డినేటర్ మహేశ్ పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు

చెన్నారావుపేట : స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్న ఎస్సై రాజేశ్‌రెడ్డిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు సిద్దన రమేశ్, తప్పెట రమేష్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భాస్కర్, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.


చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 16న నర్సంపేటలో చేపట్టనున్న ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లాడి వీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొడగాని రజిత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

పర్వతగిరి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఏనుగల్, పర్వతగిరి, ఏబీ తండాలో బుధవారం సభ్యత్వ ఇన్‌చార్జ్ గౌడ నరేందర్ సమక్షంలో వివిధ బూత్‌ల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏకాంతంగౌడ్, ఎస్సీ మోర్చా నియోజకవర్గ కోకన్వీనర్ బొట్ల మధు, శక్తి కేంద్ర అధ్యక్షుడు వెంకన్న, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

టీజేఎస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



నర్సంపేట: తెలంగాణ జన సమితి (టీజేఎస్)తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్‌జావిద్ అన్నారు. నర్సంపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక వేత్తలు పార్టీని ఆదరించాలని కోరారు. రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, బోయిని రవీందర్, ఎలిశాల రాజేశ్, ఎండీ.సంధాని, సోల్తి సాయికుమార్, దోమ రమేశ్, సాంబరాతి మల్లేశం, గుంటి సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక

సంగెం: పీఆర్‌టీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు కల్లూరి సత్యనారాయణ, మార్త శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని కాపులకనిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండల సమావేశం జరిగింది. నూతన మండల అధ్యక్షుడిగా గజ్జెల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బరిగెల కాంతారావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పాన్నోజు సత్యమూర్తి, మహిళ ఉపాధ్యక్షులుగా జి. శ్రీలత, మహిళ కార్యదర్శిగా శిరీష, కార్యదర్శిగా సూతారి రవీందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు చీకటి సమ్మయ్య పాల్గొన్నారు.

ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం

నెక్కొండ: ఎరువుల విక్రయ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ మారం రాము అన్నారు. పీఏసీఎస్ పరిధి లోని దీక్షకుంటలోని గోదాములో ఏర్పాటు చేసిన ఎరువుల కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దూరభారం కాకుండా ఉండేందుకు సమీప గ్రామాలకు ఎరువులు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో దీక్షకుంటలో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ సురేశ్, వెంకన్న, పాల్గొన్నారు.

గణపతి హోమం

నెక్కొండ : మండల కేంద్రంలోని చల్లా గోదాముల్లో (ఎఫ్‌సీఐ) బుధవారం గణపతి హోమం నిర్వహించారు. గోదాముల ప్రాంగణంలో స్వయంభూ గణపతి ఆలయంలో ప్రతిష్ఠించిన గణపతికి వేదమంత్రోచ్ఛరణల మధ్య హోమం నిర్వహించారని అర్చకుడు శ్రవణ్‌శాస్త్రి తెలిపారు. స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహారాధన అష్టదిక్పాలక, పంచలోకపాలక పూజలు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కుటుంబ సభ్యులకు యువతి అప్పగింత



వర్ధన్నపేట: తప్పిపోయిన యువతిని పోలీసులు బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ లేబర్ కాలనీకి చెందిన పాలిపాక ప్రసాద్–లక్ష్మి దంపతుల కుమార్తె బస్సు ఎక్కి ఉప్పరపల్లి గ్రామానికి వచ్చింది. గ్రామస్తులు ఆ యువతిని చేరదీసి వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు సేకరించి పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించి ఆమెను అప్పగించారు. కూతురిని క్షేమంగా అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.